# చిత్ర విచిత్రాలు

## దెందుకూరి దుర్గాప్రసాద్

'చిత్రా ఆర్ట్ పిక్చర్స్' అనే చలన చిత్ర నిర్మాణ సంస్థ నిర్మించే నూతన చిత్రానికి, అందం, నాటకానుభవం కల నూతన నటీనటులు కావలెను. బస్ట్, ప్రొఫైల్, ఫుల్‌సైజ్ ఫొటోలతో యీ క్రింది చిరునామాకు తమ ఫొటోలను యీ నెలాఖర్లోగా పంపాలి.'

ఆ పెద్దక్షరాల ప్రకటన చూసి చక్కని కలర్ ఫొటోలు తీయించి, సకాలంలో పంపించాడు కృష్ణమోహన్.

లోగడ కొన్ని చిత్ర నిర్మాణ సంస్థలకు ఫొటోలు పంపినా ఎటువంటి కాల్ రాలేదు. ఏడెనిమిది రోజులు ఎక్నాలెడ్జ్‌మెంట్ కోసం ఎదురు చూడ్డం, ఇంటర్వ్యూ వస్తుందా? రాదా? వస్తే ఏ డైలాగులు చెప్పాలి? నాటకానుభవాన్ని గురించి వివరించే పద్ధతులు... ఇలా అనుభూతులు నెమరు వేసికుంటున్న కృష్ణమోహన్‌కు ఇంటర్వ్యూ రానే వచ్చింది. పరీక్షలు పాసవడం, ఉద్యోగం పొందడం కంటే కూడ ఎక్కువ ఆనందంగా ఫీలయ్యాడు కృష్ణమోహన్.

తన నాటకానుభవ వివరాలు, యోగ్యతా పత్రాలు, ఫొటో ఆల్బం తీసికుని విజయవాడలోని ఒక పెద్ద హోటల్‌కు ఆ రోజు పది గంటలకే చేరాడు కృష్ణమోహన్.

'చిత్రా ఆర్ట్ పిక్చర్స్ ఇంటర్వ్యూలు! సెకండ్ ఫ్లోర్ రూమ్ నంబర్ 237' అనే ఇన్ఫర్మేషన్ బోర్డ్ కన్పించింది.

ఒళ్లంతా జలదరింపు. మనసంతా ఒక పులకింత. అప్పుడే తను చలనచిత్ర నటుడై పోతున్నట్లు ఒక వింత అనుభూతి. వీటన్నిటినీ మనసులో అదుము కుంటూ ఒక స్ట్రాంగ్ కాఫీ తాగి లిఫ్ట్‌లో సెకండ్ ఫ్లోర్ చేరాడు.

237 వ నంబర్ గది ముందు సుమారో ముప్పై నలభై మంది యువకులు గుమికూడి ఉన్నారు.

ఎందుకో వళ్ళంతా చెమట. కర్చీఫ్‌తో మెడ, ముఖం తుడుచుకొని గట్టిగా గాలి పీల్చి వదిలాడు కృష్ణమోహన్.

రూమ్ముందుకి వెళ్లాడు మనుషుల్లో చోటు చేసికుంటూ. ఎదురుగా దర్శకుడు కాబోలు ఆర్టిస్టుల ఫొటోలు చూస్తూ అనుభవం, వివరాలు తెలుసుకుంటున్నాడు. ఆయనకు అసిస్టెంట్ ఫొటో లందివ్వడం వగైరా చేస్తూ పేర్లు పిలుస్తున్నాడు.

పక్కన రెండు కుర్చీల్లో ఇద్దరు పెద్ద మనుషులు మల్లెపూల లాంటి బట్టలు వేసికొని స్మితంగా ఏ వ్యాపకం లేకుండా కూర్చున్నారు. నిర్మాత లయ్యుంటారు. కాస్తంత దూరంగా ఇద్దరు ముగ్గురు నాజూకైన ఆడవాళ్ళు నిల్చున్నారు. బహుశా నటీమణులు కావచ్చు.

కొంతమంది చేత ఏవో డైలాగ్స్ చెప్పిస్తున్నారు. మరి కొందర్ని ప్రశ్నలు మాత్రమే వేస్తున్నారు. స్పష్టంగా వినబడ్డం లేదు. అరగంట తర్వాత ఆఫీస్ బోయ్ 'కృష్ణమోహన్' అని పిల్చాడు.

నాటకానుభవమున్నా నటనంటే భయం లేకపోయినా వళ్ళు ఝల్లు మన్నది ఏమడుగుతారోనని.

నమస్కారమండీ! లోపలి కడుగు పెడుతుండగానే 'కూర్చోండి' అన్నాడు డైరెక్టర్ నవ్వు ముఖంతో. 'మీ అనుభవమేమిటో చెప్పండి?"

"కాలేజీ రోజుల్నుంచి నాటకాలు వేస్తున్నాను. సాంఘికాలే ఎక్కువ. రేడియో నాటికల్లో గూడ పాల్గొన్నాను. మీరవకాశం యిస్తే ఏ పాత్రలోనైనా రాణించగలననే నమ్మకముంది" అన్నాడు కృష్ణమోహన్ గొంతు సవరించుకొని పెదాల మీద నవ్వుతూ.

'మీరేం చేస్తున్నారు?'

"ఎలక్ట్రిసిటీ రెవిన్యూ ఆఫీసులో గుమాస్తా!"

"చూడండి కృష్ణమోహన్‌గారూ! ఇది మా సంస్థ నిర్మాణం చేస్తున్న మొదటి చిత్రం. టెక్నిషియన్లను మంచి వాళ్లను పెడుతున్నాం. కేవలం ఆర్టిస్టులను మాత్రమే కొత్త వాళ్ళను తీసికుంటున్నాము. మీరు మాకు నచ్చారు. ఒక కేరెక్టర్ యిస్తాం. ఎన్నో రకాల రిస్క్ తీసుకొని యీ చిత్రం తలపెడుతున్నాం. అందుచేత మీరొక ఐదు వేలివ్వగలిగితే మీ వేషం గ్యారంటీ" అన్నాడు దర్శకుడు సాభినయంగా. కృష్ణమోహన్ ఆలోచనలో పడ్డాడు. ఎలాగో ఐదు వేలు కట్టలేకపోడు. తనకు చిత్రాల్లో నటించాలనే గాఢాసక్తి ఉన్నది. తన నటన మీద తనకు నమ్మకముంది. కాని డబ్బు ఎదురిచ్చి వేషం కొనుక్కోవాలనే దాహం మాత్రం లేదు. పైగా ఇలా ఆర్టిస్ట్‌ల దగ్గర డబ్బు డిమాండ్ చేసే సంస్థలను నమ్మరాదని కొంత మంది చెప్పారు. పూర్తిగా తిరస్కరించడం కాకుండా ఆలోచించి డెలికేట్‌గా యిలా చెప్పాడు జవాబు.

'కొత్త వాళ్లతో చిత్రం తీయడం చాలా రిస్కనే మాట నిజం. మీ కభ్యంతరం లేకపోతే నా ఖర్చులు నేను పెట్టుకొని, మీరెక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి, నా వేషం పూర్తి చేస్తాను. అంతే తప్ప ఒక్కసారిగా ఎమౌంట్ చెల్లించలేను." సాభిప్రాయంగా దర్శకుడి కళ్ళలోకి చూశాడు కృష్ణమోహన్.

అతని ఎత్తుగడకు ఆ బోగస్ నిర్మాణ సంస్థ తాలూకు డైరెక్టర్ చిత్తయ్యాడని చెప్పాలి.

"సరే! మీ ఫొటోలు చిరునామా యిచ్చి వెళ్ళండి. ఏ సంగతీ వ్రాస్తాము" అనడంతో కృష్ణమోహన్ నిష్క్రమించాడు.

* * * *

ఇలాంటి అనుభవాలు ఐదారు గడిచిన తరువాత నూతన నటీనటులు కావాలనే ప్రకటన చూచి, ఉబ్బితబ్బిబ్బవడం మానుకున్నాడు కృష్ణమోహన్. మంచి దర్శకుడు, పేరున్న నిర్మాణ సంస్థ ఏదైనా పిలిస్తే తప్ప ఇంటర్వ్యూలకు వెళ్ళి, డబ్బు వ్యర్థం చేయదలచలేదు.

ఇంతలో ఐదారు చిత్రాలు తీసి ప్రస్తుతం అగ్రశ్రేణి దర్శకుడుగా తారాపథంలో ఉన్న రమాకాంత్ క్రొత్త నటీనటుల నాహ్వానిస్తూ, ఇంటర్వ్యూలకు పిల్చాడు.

రీసెంట్‌గా తీయించిన ఫొటోలతో యీ మాటు మద్రాసు వెళ్లాడు కృష్ణమోహన్. పరిచయాలు, నాటకానుభవాల వివరాలు, ఫొటో ఆల్బమ్స్ చూడడం, ప్రశ్నోత్తరాలు ముగిసిన తరువాత వచ్చిన రెండొందల నటీనటులను వడబోయగా మిగిలిన పదహారు మందిలో ఒకడయ్యాడు కృష్ణమోహన్. డైరెక్టర్‌గా రొక్కరొక్కర్ని పిల్చి మాట్లాడుతున్నారు.

ఏదో వాడుగా పిలుపొచ్చింది కృష్ణమోహన్‌కే.

ఒకసారి నమస్కారం పెట్టడం జరిగినా మళ్లీ ఫార్మాలిటీకి విష్ చేసి నిలబడ్డాడు కృష్ణమోహన్.

'రండి కూర్చోండి' తాపీగా అన్నాడు రమాకాంత్. కొన్ని సెకన్ల తరువాత "కృష్ణమోహన్ గారూ! ఇవాళ దర్శకుడుగా, ఇండస్ట్రీలో గాని, దేశంలో గాని నాకున్న యిమేజ్ మీకు తెలియనిది గాదు. సినిమా సక్సెసవడమనేది సమష్టి కృషి మీద ఆధారపడి ఉంటుంది. ఏ ఒక్కరి లోపమున్నా దర్శకుడిగా ఆ బాధ్యత నా మీద పడుతుంది. అందులో కొత్త ఆర్టిస్టుల్ని మొదటిసారిగా మేకప్ చేయించి నటనలో మీకొక స్థాయిని కల్పించాలంటే మాటలు కాదు. అందువల్ల ప్రొడ్యూసర్ మీకిచ్చే పారితోషికంలో సగం మాత్రం నా కివ్వాల్సి ఉంటుంది" అన్నాడు ముక్తసరిగా సిగరెట్ ముట్టించుకుంటూ.

కృష్ణమోహన్‌కు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లయింది. వరకట్నాల నిర్మూలనకు, కులాంతర వివాహాల ప్రోత్సాహానికి, సామాజిక సమస్యల పరిష్కారానికి, చిత్రాలు నిర్మించి అవార్డులు పొందే దర్శకుని మనస్తత్వం యింత నిష్ దరిద్రంగా ఉంటుందని అతడూహించలేదు.

"ఏమిటాలోచిస్తున్నారు?" రమాకాంత్ ప్రశ్న.

"ఆ! ఏమీ లేదు. అసలు పారితోషికంగా నా కెంతొస్తుందంటారు?" కృష్ణమోహన్ ఎదురు ప్రశ్న.

"పది వేలకు పైనే!"

తీవ్రంగా ఆలోచన మొదలైంది తనిలో. ఖర్చులు పెట్టుకుని మద్రాసొచ్చి, అభినయం, కంఠస్వరం, సంభాషణా రీతి అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణుడై కూడ దర్శకుడికి సగమివ్వాలంటే ఎందుకో అతని కర్థం కాలేదు.

ఆత్మాభిమానం అతణ్ణా పని చేయవద్దంటోంది. కాని అవకాశం వదులుకుంటే మళ్ళీ వస్తుందో రాదో అని దుగ్ధ! ఇంత సేపాలోచిస్తున్నారేమిటి? అన్నట్టుగా చూశాడు దర్శకుడు.

అంతర్మథనంలో చివరకు కృష్ణమోహన్ ఆత్మాభిమానమే నెగ్గింది. ఇంటికి వెళ్ళి వెంటనే ఉత్తరం వ్రాస్తానంటూ వెనుదిరిగాడు. అక్కడున్న నలుగురైదుగురు సువర్ణావకాశం పోగొట్టుకున్న 'అమాయక చక్రవర్తిరా' అని ముసి ముసిగా నవ్వుకున్నారు.

* * * *

కొన్ని నాటకాలు, ఏకపాత్రాభినయాలు వేస్తూ చిత్రరంగంపై ఆశతో కాలం గడుపుతున్నాడు కృష్ణమోహన్. ఆ రోజు పేపర్లో సెక్స్, క్రైం చిత్రాల డైరెక్టర్ రామాయణరావు నూతన నటీనటులు కావాలంటూ చేసిన ప్రకటన కనపడింది.

ఛాయాచిత్రాలు, యోగ్యతా పత్రాలు తీసికుని ఇంటర్వ్యూ డేటికి హైద్రాబాద్ చేరాడు. టెస్టులన్నిటిలో ఫస్టున వచ్చాడు. దర్శకుడు రామాయణరావు కృష్ణమోహన్‌కు ఉపనాయక పాత్ర నిచ్చినట్టు చెప్పి సాయంత్రం హోటల్‌లో కల్సుకోమన్నాడు.

మళ్ళీ కథ మామూలే!

రమాకాంత్ సగమడిగితే, రామాయణరావు మొత్తం పారితోషికం తనకే కావాలన్నాడు. తను ఎంత రిస్కు తీసికోవాలో కొత్త ఆర్టిస్టులతో సవివరంగా వివరిస్తూ, నటనతో డైలాగులు చెప్తూ....

అసలిలాటి దర్శకుల మనస్తత్వ మేమిటో కృష్ణమోహన్ కర్థం కాలేదు. ఆదర్శాలు, అభ్యుదయాలు, సంస్కరణోపన్యాసాలు తెర మీద చూపడం! అంతులేని స్వార్థం, కుళ్ళు, అర్థంలేని షరతులు, అమాయకులను మోసం చేసే తంతులు తెరవెనుక. ఈ ద్వంద్వ బుద్ధులు చూస్తే అసహ్యం కలుగుతోంది.

సామర్థ్యం, నటనానుభవమున్న కళాకారుడు తను. ఎదురు పారితోషిక మిచ్చి ఎలాగైనా నటించాలనే తపన లేదు. గత అనుభవాలు నెమరు వేసికుంటూ "ఇప్పుడు సెలక్టు చేసిన వారందరి దగ్గర యింతేనా సార్?!" అన్నాడు ప్రశాంత గంభీరంగా కృష్ణమోహన్.

"నా దగ్గర మొదటిసారిగా యాక్టు చేసే ఏ ఆర్టిస్టైనా యింతే!" గర్వంగా చెప్పాడు రామాయణరావు.




ఇలా అంగీకరించేటట్టైతే మూడేండ్ల నాడే రమాకాంత్ పిక్చర్లో నటించే వాడినని చెప్తూ రామాయణరావుతో ఘర్షణ పడి బయటి కొచ్చేశాడు కృష్ణమోహన్. □

Rao